క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం

నందిగామ టౌన్: స్వచ్ఛంద సంస్థలు, వెల్ఫేర్ సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. జీసెస్ క్రాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 18వ వార్డులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన కొండూరు బాబూరావును అరుణకుమార్ అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీ అరుణకుమార్‌ను సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, కౌన్సిలర్ బండారు గంగమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, బండారు వెంకట్రావ్, స్థానికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమాతో ఆర్థిక సహకారం

వీరులపాడు: వైఎస్సార్ బీమా పథకం ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం అందించి ఆదుకుంటున్నట్లు ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు తెలిపారు. మండలంలోని జుజ్జూరు గ్రామానికి చెందిన చిట్లూరి నాగేశ్వరరావు మృతి చెందటంతో వైఎస్సార్ బీమా పథకం ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.10 వేలను మంగళవారం ఆయన బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పూలా పూర్ణ, రమావత్ రాము పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమర్థంగా పనిచేయాలి

లింగగూడెం(పెనుగంచిప్రోలు): సచివాలయ సిబ్బంది సమర్థంగా పనిచేయాలని ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజి నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బరిగెల వెంకట్రామయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరించిన తహసీల్దార్



పెనుగంచిప్రోలు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ కె.లక్ష్మీ కల్యాణి ఎన్టీఆర్ జిల్లా చౌకధరల దుకాణదారుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో రేషన్ డీలర్లు ప్రజా పంపిణీని సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. కార్యక్రమంలో చౌకధరల దుకాణాల సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి జి.వడ్డీకాసులు, రేషన్ డీలర్లు, రేషన్ పంపిణీ వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

వేమవరం సొసైటీ అధ్యక్షుడిగా వేమిరెడ్డి



కంభంపాడు(వత్సవాయి): వేమవరం ప్రాథమిక సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా కంభంపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వేమిరెడ్డి వెంకట నారాయణరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా అధికారి నుంచి ఉత్తర్వులు అందాయి. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సొసైటీలోని సభ్యులకు సకాలంలో రుణాలను అందిస్తానని, సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. రుణాలు కావాల్సిన రైతులు నేరుగా సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వెండి తాపడం తయారీకి రూ.30 వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలోని అంకమ్మ వారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి మంగళవారం జగ్గయ్యపేట పట్టణానికి చెందిన నలమోలు మిహిర తేజ, కార్తీక దంపతులు రూ.30 వేలు విరాళం ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఏప్రిల్‌లో ఓపెన్ స్కూల్ పరీక్షలు

నందిగామ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ఏప్రిల్ నెలలో జరుగుతాయని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.బాబూరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ నెల మూడో తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెంటనే ఫీజులు చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 89776 45706 నంబరును సంప్రదించవచ్చన్నారు.

ఖర్చులను తగ్గించి ఆదాయాన్ని పెంచుదాం

- పురపాలక సంఘ బడ్జెట్ సమావేశంలో చైర్మన్ రాఘవేంద్ర
- బడ్జెట్‌లో ప్రజా సంక్షేమానికి పెద్ద పీట



హాజరైన కౌన్సిల్ సభ్యులు, మాట్లాడుతున్న పాలకవర్గ సభ్యుడు నూకల సాంబశివరావు

జగ్గయ్యపేటఅర్బన్: పురపాలక సంఘంలో వృథా ఖర్చులను తగ్గించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సూచించారు. స్థానిక పురపాలక సంఘంలోని కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో మంగళవారం 2022–23 సవరించిన బడ్జెట్, 2023–2024 వార్షిక బడ్జెట్ సమావేశంతో పాటు సాధారణ సమావేశం చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. బడ్జెట్ వివరాలను చైర్మన్ రాఘవేంద్ర వెల్లడించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి జగ్గయ్యపేట పురపాలక సంఘానికి మిగులు బడ్జెట్ రూ.44,85,834 అని తెలిపారు.

ఎస్సీ సబ్ ప్లాను నిధులు రూ.50 లక్షలకు ప్రతిపాదనలు

ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఎక్కడ కేటాయిస్తారు, ఎంత వస్తుందని ప్రతిపక్ష సభ్యులు సైదేశ్వరరావు, వెంకట్ ప్రశ్నించగా, చైర్మన్ మాట్లాడుతూ రూ.50 లక్షలకు ప్రతిపాదనలు చేశామని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు క్రిస్టియన్‌పేట, విలియంపేటలో ఖర్చు చేయాలని సూచించారు. ఇప్పటికే ఎమ్మెల్యే ఉదయభాను కృషితో రూ.15 లక్షలతో క్రిస్టియన్‌పేట శ్మశానవాటిక అభివృద్ధి చేసినట్లు తెలిపారు. విలియంపేటలో శ్మశానవాటిక అభివృద్ధితో పాటు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని సూచించారు. పాలకవర్గ సభ్యులు వట్టెం మనోహర్, కొలగాని రాము మాట్లాడుతూ పలు వార్డులో విద్యుత్ స్తంభాలు శిథిలమై విరిగిపోయే పరిస్థితి ఉందని, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఏఈ వివరణ ఇవ్వాలని కోరారు. ఏఈ బాలాజీనాయక్ మాట్లాడుతూ ఒకే కంట్రాక్టర్ ఉండటం వలన జాప్యం జరుగుతోందని, ఇప్పటికే 20 వరకు కొత్త స్తంభాలను మార్చామని తెలిపారు. చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ 100 స్తంభాలు మార్చాలని ప్రతిపాదనలు చేస్తే 20 మాత్రమే మార్చడం దారుణం అని, సరిగా వ్యవహరించకపోతే విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

చెరువు అభివృద్ధికి రూ.కోటి కేటాయింపుపై హర్షం

ఊర చెరువు అభివృద్ధికి ఎమ్మెల్యే ఉదయభాను కోరిన మీదట అల్ట్రాటెక్ సిమెంట్స్ వారు రూ.కోటి సీఎస్సార్ నిధులు కేటాయించినందుకు వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ లేచి కౌన్సిల్ సభ్యులంతా ఎమ్మెల్యేకు అభినందనలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.

కౌన్సిల్ సాధారణ సమావేశం

అనంతరం కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన జరిగింది. ముందుగా కౌన్సిల్ సీసీ తాజుద్దీన్ అజెండాలోని అంశాలను సభ్యులకు చదివి వినిపించారు. తొమ్మిదవ అంశానికి సంబంధించి ప్రతిపక్ష సభ్యులు అలేఖ్య, సైదేశ్వరరావు మాట్లాడుతూ ధనంబోడు కాలనీకి ఆర్చి ఏర్పాటుచేసే విషయంలో దుర్గాపురం కూడా ఉన్నందున నాగలక్ష్మి అమ్మవారి పేరు కూడా పెట్టాలని, వేరే పేరు పెడితే కనీసం అమ్మవారి బొమ్మ అయినా పెట్టాలన్నారు. దీనిపై పాలకవర్గ సభ్యుడు వట్టెం మనోహర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉదయభాను హయాంలో జిల్లాలో ఎక్కడా లేని విధంగా 45 ఎకరాల్లో 1236 గృహాలు నిర్మించి మోడల్ కాలనీగా పేరు పొందిందని, అందువలన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పెట్టడమే సమంజసంగా ఉంటుందని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ హఫీజున్నీసా, కౌన్సిలర్లు నూకల సాంబ, పందుల రోశయ్య, ఖాదర్‌బాబు, రామలక్ష్మి తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు. కమిషనర్ శివకోటేశ్వరరావు, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ రాఘవేంద్ర

బడ్జెట్ ముఖ్య అంశాలు...

2022–23 సవరించిన బడ్జెట్ అంచనాలతో పాటు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలు ఈ విధంగా ఉన్నాయి.

రెవెన్యూ జమలు	: రూ 12.28,75,000(12.28 కోట్లు)
రెవెన్యూ ఖర్చులు	: రూ 10.48,68,000(10.48 కోట్లు)
రెవెన్యూ మిగులు	: రూ 1.80,07,000(1.80 కోట్లు)
మూల ధన జమలు(క్యాపిటల్ రిసిప్ట్స్)	: రూ 57,15,00,000(57.17 కోట్లు)
మిగులు నిధులు బదిలీ (అభివృద్ధి పనుల నిమిత్తం)	: రూ 1,80,07,000(1.80 కోట్లు)
మూల ధన ఖర్చులు	: రూ 58,50,21,166 (58.50 కోట్లు)
నికర మిగులు:	: రూ 44,85,834(0.448 కోట్లు)

స్వాతంత్య్ర యోధుడు ఓబన్న స్ఫూర్తి మరువలేనిది

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



కంచికచర్లలో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ప్రారంభించి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, వడ్డెర సంఘ నాయకులు

కంచికచర్ల: దేశ స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన వీరోచిత నాయకుడు, బ్రిటీష్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన వడ్డే ఓబన్న స్ఫూర్తి మరువలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్ల ఇందిరాకాలనీ గొట్టుముక్కల రోడ్డులో మంగళవారం వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నాడు స్వాతంత్ర్య పోరాటంలో రేనాటి ప్రాంతంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి అంగరక్షకుడిగా, సైన్యాధ్యక్షుడుగా పనిచేసిన ఓబన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, ఓబన్న మనుమడు నరసింహుడు, వడ్డెర సంఘ రాష్ట్ర నాయకుడు, విగ్రహదాత అచ్చి చినబాబు, బేబీరాణి, తన్నీరు ఆంజనేయులు, ధర్మరాజు, ఓర్సు జ్వాల, బండారు శేషు, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు వేమా సురేష్‌బాబు, నన్నపనేని నరసింహారావు, దేవరకొండ గురవయ్య, మార్త శ్రీనివాసరావు, వేల్పుల శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, ఒంటిపులి ప్రసాద్, నరేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు

ఆర్డీఓ రవీంద్రరావు



భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీంద్రరావు

నందిగామ: గూడు లేని ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు. చందర్లపాడు మండల పరిధిలోని మునగాలపల్లి, చింతలపాడు గ్రామాలలో రెండో విడత అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు అవసరమైన భూమి కొనుగోలు చేసే ప్రక్రియలో భాగంగా మంగళవారం పలు భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూముల సేకరణ పూర్తవగానే అర్హులైన లబ్ధిదారులకు రెండో విడత పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ సుశీల, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం



జుజ్జూరు రోడ్డులో విద్యుదాఘాతంతో దగ్ధమైన లారీ ముందు భాగం

కంచికచర్ల: షార్ట్ సర్క్యూట్‌తో లారీ ముందు భాగం దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలు ఆర్పివేయటంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. వీరులపాడు మండలం పొన్నవరం నుంచి రాజమండ్రి కాగిత పరిశ్రమకు మంగళవారం సుబాబుల్ లోడుతో లారీ బయలుదేరింది. కంచికచర్ల పొన్నవరం క్రాస్‌రోడ్డు సమీపంలోకి రాగానే లారీలోని ఇంజన్ నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు రావటంతో లారీ ముందు భాగం కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్ర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని లారీ పైకి ఎగిసిపడుతున్న మంటలను ఫైర్ వాహనం ద్వారా ఆర్పివేశారు. దీంతో సుబాబుల్ కర్రకు మంటలు ఎగబాకలేదు. ఫైర్ అధికారి పూర్ణచంద్రరావు, సిబ్బంది కృష్ణమూర్తి, ఎం.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, షేక్ తాజుద్దీన్, కిషోర్‌రెడ్డి, జీవీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కంచికచర్ల: ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న కారు ఢీ కొనడంతో తీవ్రగాయాలై మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపిన వివరాల మేరకు మండలంలోని దొనబండ గ్రామానికి చెందిన గంధం శ్రీనివాసరావు(50) ప్రయివేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం విజయవాడ వెళ్లి రాత్రి తిరిగి వచ్చి బస్సు దిగి ఇంటికి నడుచుకుంటూ వెళుతూ రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసరావుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితుడిని వైద్యం కోసం విజయవాడకు ప్రయివేటు వాహనంలో తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేడు నెమలిలో భీష్మ ఏకాదశి పూజలు

గంపలగూడెం: నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం భీష్మ ఏకాదశి పర్వదినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, ఏసీ కె.శాంతి తెలిపారు. స్వామికి లక్ష తులసి దళాలతో కుంకుమార్చన, రాజ్యలక్ష్మి దేవికి దశ సహస్ర కుంకుమార్చననిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



నందిగామ: స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ శుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించడంతోపాటు పెండ్లి కుమారునిగా ముస్తాబు చేశారు. అమ్మ వారిని బాల త్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాత్రి సమయంలో స్వామి వారికి గ్రామోత్సవం నయనానందకరంగా నిర్వహించారు.

అక్రమ లేఅవుట్లు ధ్వంసం



అక్రమ లే అవుట్లను ధ్వంసం చేస్తున్న నగర పంచాయతీ అధికారులు

నందిగామ: నగర పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం హెచ్చరించారు. పట్టణం సమీపంలో అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం పలు లే అవుట్లను అధికారులు క్రేన్ సహాయంతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే లేఅవుట్లు ఏర్పాటు చేయాలన్నారు. అనుమతులు లేకుండా లేఅవుట్లు ఏర్పాటు చేసి వినియోగదారులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు.

నేటి నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్ఠా మహోత్సవాలు



ప్రతిష్ఠించనున్న ఐదు అడుగుల శనైశ్చర విగ్రహం

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర నగర్‌లో గల సాయి అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో పలు దేవతామూర్తుల ప్రతిష్ఠా కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ఐదు అడుగుల శనైశ్చర స్వామి వారి విగ్రహంతో పాటు, అభయాంజనేయ స్వామి, నవ నాగుల విగ్రహాలతో పాటు మరికొన్ని విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నిర్వాహకులు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న సీఎం జగన్

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



కంచికచర్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్లలో 16, 17 వార్డులలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్ బాబు, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, శేషం వాసుబాబు, మార్త శ్రీనివాసరావు, వేల్పుల శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, తంగిరాల సృజినీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా కుంభాభిషేకం



ఆలయ శిఖరానికి కుంభాభిషేకం నిర్వహిస్తున్న స్వామీజీ

నందిగామ: పట్టణంలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం మహా కుంభాభిషేక కార్యక్రమం పండుగలా జరిగింది. తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా ఆలయంలోని అమ్మవారికి, శిఖరానికి మహా కుంభాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లోక శాంతిని కాంక్షిస్తూ అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలతో పాటు పలు రకాల హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు ఎస్.ఫణి కుమార్, గోపాలకృష్ణ, అనిల్ కుమార్, కృష్ణమోహన్, సుధీర్ పర్యవేక్షణలో భారీ అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 15 వేల మంది భక్తులు హాజరయ్యారు.

ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

కుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ హాజరయ్యారు. వేద పండితులు ఆయనను సత్కరించి, ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఆర్డీవో రవీంద్రరావు, నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం, ఎస్‌హెచ్ఓ సతీష్, పలు శాఖల అధికారులు, పలువురు ప్రముఖులు కుంభాభిషేక కార్యక్రమానికి హాజరయ్యారు.

అమ్రితసాయిలో ఉచిత వైద్య శిబిరం



పరిటాల అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాలలో వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

కంచికచర్ల: పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో విజయవాడ ఆంధ్ర హాస్పిటల్ వైద్యులు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. కళాశాల సిబ్బంది, అధ్యాపకులకు వైద్యుడు వై.రమేష్ గుండె పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, 2డీ, ఎకో, ఈసీజీ, కిడ్నీలకు సంబంధించిన రోగాలను పరీక్షించారు. అవసరమైన మందులు అందజేశారు. కళాశాలలో మొత్తం 150 మందికి వైద్య పరీక్షలు చేశారని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ వినీల, కళాశాల సీఈఓ డాక్టర్ సాయిమనోజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ జయరాం



నందిగామ నాలుగో వార్డు పరిధిలో అందుతున్న తాగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్

నందిగామ: నగర పంచాయతీ పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. పట్టణ పరిధిలోని నాలుగవ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు.స్థానికులకు సరఫరా అవుతున్న తాగునీటిని పరిశీలించడంతో పాటు ఆ ప్రాంతంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తడి, పొడి, హానికరమైన చెత్తను వేర్వేరుగా భద్రపరచి పారిశుద్ధ్య కార్మికులకు అందించి పారిశుద్ధ్య మెరుగుదలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ సర్వే సమగ్రంగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో జయచంద్ర

గౌరవరం(జగ్గయ్యపేట): కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ ప్రోగ్రాం కింద ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం సర్వేను వలంటీర్‌లు నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎంపీడీవో జయచంద్ర అన్నారు. గ్రామంలో జరుగుతున్న సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీంను ప్రజలకు వివరించి ఈకేవైసీ చేయాలన్నారు. గ్రామంలో ఇప్పటివరకు 30 శాతం మాత్రమే అయిందని నూరు శాతం అయ్యేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జగ్గయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సోషల్ ఆడిట్ గ్రామసభలు

జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి, గండ్రాయి, షేర్ మహ్మద్‌పేట, గౌరవరం, బండిపాలెం గ్రామాల్లో మంగళవారం సోషల్ ఆడిట్ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం అధికారులు రెండేళ్లుగా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులను గ్రామసభలో వివరించారు. ఈ సందర్భంగా ఏపీఎం సంతోష్ మాట్లాడుతూ గ్రామసభలో గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులలో అభ్యంతరాలను కూలీలు, గ్రామస్తులు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులు జగ్గయ్య, మంగ, పీఏసీఎస్ చైర్మన్ బాలసైద తదితరులు పాల్గొన్నారు.